క్లుప్తంగా

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



ఫిరంగిపురం: మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామానికి చెందిన ఎం.మాణిక్యం అనే యువతికి చిన్నతనంలోనే పోలియో సోకి నడించేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. కాగా ఇటీవల గ్రామంలోని సచివాలయం ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దివ్యాంగురాలిని పలకరించి వారి తల్లిదండ్రులైన శివయ్య, కనకమ్మల కోరిక మేరకు ట్రైసైకిల్‌ను పంపించారు. దీంతో గురువారం కో–ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్ నాగవేణి, ఉపసర్పంచ్ రోశయ్యలు దివ్యాంగురాలికి ట్రై సైకిల్‌ను అందజేశారు.

ఏకలవ్య విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

తాడికొండ: మండల కేంద్రం తాడికొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహం, ఆధునికీకరించిన కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐపీఎస్ అధికారి తోకల మోహన్‌రావు, తోకల చినవీరోజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోకల నరసింహారావులు పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి ముద్దుబిడ్డ ఏకలవ్య అని, మట్టి బొమ్మను తయారు చేసి విలువిద్యలు నేర్చుకున్న ఏకలవ్యుని ఏకాగ్రత అమోఘమన్నారు. ఎరుకల సంఘం నాయకులు తోకల కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పాపారావు, ప్రభు కోటేశ్వరరావు, గోపి, హరీష్, పలువురు సంఘ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెల్లెంపూడిలో రామాలయ పునఃప్రతిష్టా మహోత్సవం

తాడేపల్లిరూరల్: మెల్లెంపూడిలో సీతారామ స్వామి దేవస్థానంలో విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మెల్లంపూడి గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) విచ్చేసి ప్రత్యేకపూజలు చేశారు. వినాయక దేవస్థానం 18వ వార్షికోత్సవం సందర్భంగా, రాముల వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు బొమ్మారెడ్డి సునీతా రెడ్డి, రాజారామిరెడ్డి, నాని, శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరా నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు కూలీలకు రూ.5 వేల పింఛన్ పంపిణీ

హాజరు కానున్న ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త సుచరిత

తాడికొండ: నేడు తుళ్లూరు మేరీమాత హైస్కూల్‌లో రాజధాని ప్రాంతంలో రైతు కూలీలకు పెంచిన రూ.5 వేలు పింఛన్ పంపిణీ కార్యక్రమం జరగనుందని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా కోదండ రామస్వామి ఆలయ శంకుస్థాపన

పెదపరిమి(తాడికొండ): తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నూతనంగా నిర్మింప తలపెట్టిన కోదండ రామస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోదరుడు నంబూరు శ్రీనివాసరావు చేతుల మీదుగా వేదపండితుల సారథ్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి నుండి 22 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

తెనాలిరూరల్: ఎనిమిదో తరగతి విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన దమ్ము హెప్సిభారతి(13) ఐతానగర్ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనికి వెళ్లిన తండ్రి రాజు ఇంటికి వచ్చి చూడగా బాలిక ఉరికి వేలాడుతూ కనబడింది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పేద మహిళలందరికీ ఇళ్ల స్థలాలు

- పేదింటి ఆడ పడుచులకు రూ.లక్షలు విలువైన ఆస్తిని ఇచ్చిన జగనన్న
- ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్లు
- టీడీపీ హయాంలో ఒక్కరికి సెంటు భూమి ఇచ్చిన దాఖలా లేదు
- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయ కర్త, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- ఫిరంగిపురంలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



ఫిరంగిపురంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: అర్హులైన ప్రతి ఒక్క మహిళకు ఇళ్ల స్థలాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండల కేంద్రం ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు తీసుకున్నవారికి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మేకతోటి సుచరిత మాట్లాడుతూ నవరత్నాల పథకం ద్వారా రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ 31లక్షల ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించారని చెప్పారు. వారిలో 15లక్షల మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇళ్లస్థలాల కోసం ఏళ్ల తరబడి ఆయా కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేదని, అయినా పని కాక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. కానీ నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారని చెప్పారు. ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు భూములను కొనుగోలు చేసి స్థలాలు కేటాయించినట్లు తెలపారు. పేదల సొంతింటి కలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. మహిళల పేరిట ఇళ్ల స్థలాల పత్రాలు ఇచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. రూపాయి ఖర్చులేకుండా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. నేడు ఆయన ఇచ్చిన ఇళ్లస్థలాల్లో ఎందరో పేదలు ఇళ్లు నిర్మించుకొని సొంతింటికలను సాకారం చేసుకున్నారని చెప్పారు. మీకు లబ్ధి చేకూరితేనే తనకు ఓటేయాలని చెప్పిన దమ్మున్న నాయకుడు జగనన్న అని అన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, డి.మెల్కియా, బి.అంజిరెడ్డి, చౌడయ్య, టి.కృష్ణ, డేవిడ్, పి.బాబురావు, పి.చిన్న, హేమలతారెడ్డి, వీరయ్య, రఘు, చేవూరిరామమోహన్‌రెడ్డి, పి.చిన్న, ఎస్.చిన్నప్ప, కె.శ్రీనివాసరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, జి.చంద్రశేఖరరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, జి.మస్తాన్‌వలి, జి.కోటేశ్వరరావు, ఎస్.నాగరాజు, సంజీవరెడ్డి, అయ్యప్ప, మస్తాన్‌వలి, డీటీ రాజా రమేష్, ఎంపీడీఓ విమాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదవాడికి భరోసా..

తాడికొండ: ప్రతి పేదవాడికి భరోసా అందించే పాలన జగనన్నతోనే సాధ్యమని, ఇచ్చిన మాటకు కట్టుబడి నవరత్నాల పాలనలో భాగంగా అన్ని హామీలు నెరవేర్చి పేదలకు కానుకగా ఇచ్చారని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే సుచరిత అన్నారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ మరియు కన్వేయన్స్ డీడ్ పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాడికొండ మండలంలో మొత్తం 2991 మహిళా లబ్ధిదారులకు గాను 2244 రిజిస్ట్రేషన్లు పూర్తవగా, 1914 మంది మహిళా లబ్ధిదారులకు కన్వేయన్ డీడ్స్‌ను అందించామన్నారు. వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తాళ్ళ శివనాగరాజు పాల్గొన్నారు.

పెదపరిమిలో..

పెదపరిమి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చేతుల మీదుగా 231 ఇళ్ళ స్థలాలకు సంబంధించిన పట్టాల రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్‌లను లబ్ధిదారులకు అందించారు. నాయకులు కొప్పుల శేషగిరిరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పుట్టి సుబ్బారావు, సీనియర్ నాయకులు నంబూరు రఘునాధరావు, అక్కల లక్ష్మీనారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు మున్నంగి కోటిరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి..



మాదు కుటుంబాలు ఉన్న మా ఇంట్లో వంట చేసుకోవాలంటేనే ఎంతో ఇబ్బందిగా ఉండేది. మాకు జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా నిర్మాణానికి నగదు కూడా అందించడంతో ఇళ్లు నిర్మించుకున్నాం. జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– జి.శాంతమ్మ, పొనుగుపాడు

అద్దె ఇంటి బాధ తీరింది



ఇప్పటివరకు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. జగనన్న కాలనీల్లో మాకు ఇంటిస్థలం కేటాయించారు. జగనన్న దయతో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉండేందుకు వెళుతున్నాం. మాకష్టాలు తీరాయి.

– టి.రోశమ్మ, తక్కెళ్లపాడు

జగనన్నను మరువం..



నేను నా భర్త ఇద్దరం దివ్యాంగులం. పొలం పనులకు వెళుతూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. స్థలం కోసం అర్జీపెట్టుకోగానే స్థలం ఇవ్వడమే కాకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి జగనన్న ఆదుకున్నారు. రూ.లక్షల ఆస్తిని నా పేరిట ఇచ్చిన జగనన్నను మరువను. జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– సీహెచ్ మంగమ్మ, మునగపాడు

పౌష్టికాహారంతో రక్తశాతం పెంపు



రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఫిరంగిపురం: పౌష్టికాహారంతో చిన్నారుల రక్తహీనత తొలగి రక్తశాతం పెరిగిందని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం –3 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను టాస్క్‌ఫోర్సు టీం సభ్యులు గురువారం పరిశీలించారు. స్థానికంగా శాంతిపేట, హౌస్‌గణేష్, ఉర్దూపాఠశాలలను వెళ్లి విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి పరిశీలించారు. అంతే కాక గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి హెచ్‌బీ, బీపీ పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తశాతం పెరిగిందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పనితీరు పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆమెవెంట ఎస్‌హెచ్‌ఎం సైమన్, హెచ్‌వీ వహీద, సపోర్టింగ్ అసిస్టెంట్ షరీఫ్, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన, ఏఎన్ఎంలు భారతీజ్యోతి, అరుణ, మాబు, ఆంథోనిరాణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రేపు చర్మకారుల భవనం ప్రారంభోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని చర్మకారుల కోసం నులకపేట ఐటీసీ వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ చర్మకారుల భవన ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో పాత మంగళగిరి ప్రకాశం బ్యారేజ్, పాత జాతీయ రహదారి వెంబడి స్థలాన్ని కేటాయించి రూ.75 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేశారన్నారు. ఈనెల 2వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని డప్పు కళాకారులందరూ తమ డప్పులతో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు, భవన ప్రారంభానికి విచ్చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తాడేపల్లి పోలీసులు గురువారం సీజ్ చేశారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చిర్రావూరు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో తమ సిబ్బందితో తనిఖీలు చేశామని, ఈ తనిఖీల్లో రెండు ట్రాక్టర్లును సీజ్ చేసి, ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసి కోర్టు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చిలువూరులో బీజేపీ నేతల పర్యటన



ప్రజాపోరులో భాగంగా చిలువూరును సందర్శించిన బీజేపీ నాయకులు

తాడేపల్లిరూరల్: పార్టీ ఆదేశాల మేరకు మండల పర్యటన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగ్గవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన నరేంద్రమోదీ ఆదేశాల మేరకు ప్రజాపోరులో భాగంగా చిలువూరు గ్రామాన్ని సందర్శించామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించామని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ నాయకులు పంచుమర్తి ప్రసాదరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి రామకృష్ణ, నాయకులు ఉమ్మయ్య చౌదరి, మారెళ్ళ సాంబశివరావు, శివాజీ పాల్గొన్నారు.

ప్రమాద నియంత్రణ చర్యలపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడికొండూరు: ముందస్తు అగ్ని ప్రమాద నియంత్రణపై చేపట్టాల్సిన చర్యలపై ప్రయోగకపూర్వక శిక్షణ కార్యక్రమం గుంటూరు మండలంలోని డోగిపర్రు జోసిల్ కంపెనీలో జరిగింది. గుంటూరు జిల్లా డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి ఎం.వి.శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు సంస్థల్లో అగ్ని ప్రమాదాల సమయంలో భద్రతా చర్యలపై ప్రయోగపూర్వకంగా అనుభవజ్ఞులతో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాద సమయంలో మంటల్లో పొగఉన్న ప్రదేశాల్లో ఉన్నవారిని ఎలా రక్షించాలి, బహుళ అంతస్తుల నుంచి ఎలా రక్షించాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురహరి, హెడ్ కానిస్టేబుల్ శ్రీక్రాంత్ రెడ్డి, జోసిల్ కంపెనీ ప్రొడక్షన్ అడ్వైజర్ రామినేని బెనర్జి బాబు, జోసిల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఫిరంగిపురం: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసునమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా అరసవెల్లికి చెందిన ఇ.గడ్డయ్య ఏడేళ్ల కిందట ఫిరంగిపురం వలసవచ్చి తూర్పు బజారులో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తుంటాడు. ఈక్రమంలో ఈనెల 25న పనికి అని చెప్పి ఇంటినుంచి వెళ్లాడు. మరునాడు అయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వారిని, బంధువుల ఇళ్లలో వాకబుచేశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో గురువారం కుమార్తె శ్రీదేవి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రచయిత్రి జ్యోతి స్వరూపరాణి మృతి



డాక్టర్ జ్యోతి స్వరూపరాణి (ఫైల్)

తెనాలి: పట్టణ చెంచుపేటకు చెందిన విశ్రాంత అధ్యాపకురాలు, రచయిత్రి డాక్టర్ గుజ్జర్లమూడి జ్యోతి స్వరూపరాణి (74) గురువారం తెల్లవారుజామున గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. జ్యోతి స్వరూపరాణి భర్త ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి ప్రస్తుతం దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉన్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జ్యోతి స్వరూపరాణి జేఎంజే మహిళా కాలేజీలో అధ్యాపకురాలిగా, తెలుగు శాఖాధిపతిగా పనిచేశారు. 'నన్నయ తీర్చిన శకుంతల' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ స్వీకరించారు. దాదాపు 150 పైగా రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 23 రేడియో నాటికలు, 10 నృత్య నాటికలు రచించారు. ఆమె రచనలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వ విద్యాలయాలు డిగ్రీ, పీజీ తరగతుల్లో పాఠ్యాంశాలుగా చేర్చారు. మరణానంతరం తన నేత్రాలను శంకర నేత్రాలయానికి దానం చేశారు. వివిధ రంగాల ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం ఆమె అంత్యక్రియలను పూర్తిచేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు పురస్కారాలు

తెనాలిరూరల్: స్థానిక ఐతానగర్‌లోని 22 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలో పరేడ్‌కు హాజరై అద్భుత ప్రతిభను చాటినందుకు గానూ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జె.మహేష్ అభినందనలు తెలియజేశారు. గురువారం ఐతానగర్‌లోని బెటాలియన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్‌సీసీ విద్యార్థులను సత్కరించారు. పరేడ్‌లో గత ఏడాది ఒక్క విద్యార్థి మాత్రమే పాల్గొన్నాడని, ఈ ఏడాది ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొనడం సంతోషకరమని అన్నారు. పరేడ్‌లో పాల్గొన్న క్యాడెట్స్ వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ నుంచి సీనియర్ అండర్ ఆఫీసర్ ఎం.వంశీకృష్ణ, బాపట్ల ఫార్మసీ కాలేజీ నుంచి ఎన్.శ్రీకాంత్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ నుంచి కోమలిలను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. ఇందుకు క్యాడెట్స్ కృషి, శ్రమలతో పాటు వాళ్లకి ఉన్నత శిక్షణ ఇచ్చిన బెటాలియన్ పీఐ స్టాఫ్, కాలేజీ ఏఎన్‌ఓ, సీటీవోలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. లెఫ్టినెంట్ జె మహేష్‌తో పాటు సుబేదార్ కృష్ణ జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నగరంలో ఉద్యానవనాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి

మంగళగిరి: నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. గురువారం మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరులోని పార్కు ప్రహరీని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పొరేషన్‌కు చెందిన విలువైన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా తగుచర్యలు తీసుకునే కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే పార్కులను అభివృద్ధి చేశామని, తాజాగా ఆత్మకూరులో పార్కును నిర్మించడం జరుగుతుందన్నారు. ఆయా పార్కుల్లో ఓపెన్ జిమ్‌తో పాటు చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు, వృద్ధులు కాసేపు సేదతీరేలా గద్దెలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చుట్టూ వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్ని పంచే మొక్కలు, పచ్చని గార్డెనింగ్‌తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నగర కమిషనర్ నిర్మల్ కుమార్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం..

మంగళగిరి: నగరంలోని వడ్లపూడి సెంటర్ నాంచారమ్మ చెరువులో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి, గణపతి, లక్ష్మీదేవి, సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధ్వజ స్తంభ ప్రతిష్ట, శిఖర ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవిలు హాజరై స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

రైతులను ఆదుకోవాలని వినతి



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా మధుసూధన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల గ్రామంలో జనవరి 19న శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా మధుసూధన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్యలు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జనవరి 19 నాటి మార్కెట్ ధర ప్రకారం పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ ఇప్పించాలని, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం కొంత మంది రైతులకు బాండ్లు ఇవ్వకుండా పేమెంట్ స్లిప్‌లపై రాసి ఇచ్చారని, అటువంటి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామని, కార్పొరేషన్ చైర్మన్ చల్లా మధుసూధన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శుభం కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, రైతులు ఆళ్ల వెంకటప్ప రెడ్డి, లంకిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ మేలుజాతి దూడల ప్రదర్శన



నూతక్కి పశువైద్య కేంద్రంలో స్వదేశీ మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి పశువైద్య కేంద్రం ఆవరణలో గురువారం స్వదేశీ మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెనాలి వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేదార్ మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సమర్ధవంతమైన లేగదూడల పెంపకం పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పసిదూడల సంరక్షణకు పశుపోషకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ జాతి లేగదూడలను సంరక్షిస్తున్న పశుపోషకులకు బహుమతులు అందజేశారు. మంగళగిరి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ నరేంద్ర రెడ్డి, డాక్టర్ టి.ప్రవీణ, డాక్టర్ ఎస్‌కే యాస్మిన్ సుల్తానా, డాక్టర్ కె.ఛాయా వినయదేవి, డాక్టర్ ఎ.వీర ప్రసాద్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్

తెనాలిరూరల్: కొల్లిపర మండలం దావులూరు అడ్డరోడ్డు వద్ద ఫిబ్రవరి 25న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్య జరిగినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హత్య కేసు నిందితుల వివరాలను డీఎస్పీ రమేష్ తెలియజేశారు. కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావును అదే గ్రామానికి చెందిన చాగంటి రాజశేఖరరెడ్డి, దావులూరుకు చెందిన భార్యాభర్తలు సమ్మెట ఆంజనేయులు, సమ్మెట భూలక్ష్మీలు గొంతు కోసి హత్య చేసినట్లు చెప్పారు. మృతుడి తల్లి నాలాది విశ్రాంతమ్మ ఫిర్యాదు మేరకు కొల్లిపర ఎస్ఐ ఆర్.రవీంద్రారెడ్డి కేసు నమోదు చేయగా రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మృతుడు సాంబశివరావుకు, దావులూరుకు చెందిన సమ్మెట భూలక్ష్మికి గతంలో వివాహేతర సంబంధం ఉండేది. ఇరువురికి గొడవలు జరిగి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోగా ప్రస్తుతం ఆ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కాలంలో భూలక్ష్మి తమూలూరుకు చెందిన చాగంటి రాజశేఖరరెడ్డితో సన్నిహితంగా ఉండడంతో సాంబశివరావు తరచూ వారితో ఘర్షణ పడుతుండేవాడు. భూలక్ష్మి ఎక్కడ కనబడినా ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ అందరి ముందు అవమాన పరిచేవాడు. భూలక్ష్మి, ఆంజనేయులుపై సాంబశివరావు గతంలో పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసు కోర్టులో విచారణకు వచ్చింది. కేసులో రాజీకి రావాలని వీరు సాంబశివరావును కోరగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ కారణలతో అతడి అడ్డు తొలగించుకోవాలని భావించిన ముగ్గురు నిందితులు ఈ నెల 25న ఫూల్‌గా మద్యం తాగించి మత్తులో పడి ఉన్న అతడిని గొంతుకోసి హత్య చేశారు. దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసిన రూరల్ సీఐ టీ. వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవీంద్రారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు డి శ్యామ్ కుమార్, ఆర్ రాజేష్, బి. తాతారావు, కానిస్టేబుల్ ఎం. కూర్మారావులను డీఎస్పీ అభినందించారు.

3న సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు

తెనాలిఅర్బన్: ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వైఐ అమరావతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎన్వీఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. కళాశాలలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. సీఈవో నన్నపనేని భాస్కర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారి నమూనాలను త్వరలో జరగనున్న సైన్స్ డే వేడుకల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ వీబీఎస్ అజయ్ పాల్గొన్నారు.